ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

విజయనగరం	మన్యం
10.65 %	6.53 %
25.42 %	15.54 %
35.60 %	34.98 %
56.19 %	51.75 %
59.86 %	58.34 %
70.87 %	63.51 %
78.20 %	

శృంగవరపుకోట.. బారులు తీరిన ఓటర్లు


జామిలో రోగిని తీసుకొస్తున్న సహాయకులు

సాలూరు మండలం శిఖపరువులో బారులు తీరిన గిరిజన ఓటర్లు

ఓ(పో)టెత్తారు

- తొలుత మందకొడి ... ఆ తరువాత వేగవంతం
- పలుచోట్ల రాత్రి వరకు పోలింగ్
- వర్షం, విద్యుత్ అంతరాయంతో అవస్థలు
- కొన్నిచోట్ల మొరాయించిన ఇవిఎంలు
- పిఎస్ఆర్ పురంలో పిఒపై వైసిపి ఏజెంట్ల దాడి
- కొన్నిగ్రామాల్లో చెదురుమదురు సంఘటనలు
- వడదెబ్బకు ఇద్దరు ఓటర్లు మృతి
- రాజాంలో సొమ్మసిల్లిన పోలింగ్ సిబ్బంది
- పోలింగ్‌ను బహిష్కరించిన భోజరాజుపురం గ్రామస్తులు

ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న మంత్రులు బొత్స సత్యనారాయణ ; పీడిక రాజన్నదొర

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గడిచిన రెండు దఫాలుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ప్రజలు తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించు కున్నారు. విజయనగరం జిల్లాలో 78.20 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో సాయంత్రం ఐదు గంటల వరకు 63.51 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు జిల్లాల్లోనూ ఉదయం 7గంటలకే చాలా చోట్ల ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరారు. ఎక్కువ చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఉదయం 11గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. సరిచేయడానికి వీలు కాని కేంద్రాల్లో ఇవిఎంలను మార్పుచేశారు. ఆ తరువాత పోలింగ్ ఊపందుకుంది. ఎస్.కోట, కొత్తవలస తదితర ప్రాంతాల్లో సాయంత్రం 6గంటల తరువాత ఓవైపు వర్షం కురవడం, మరోవైపు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో చాలాసేపు పోలింగ్ నిలిచి పోయింది. దాదాపు అన్ని నియోజక వర్గాల్లోనూ కొన్ని గ్రామాల్లో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మెరక ముడిదాం మండలం ఉత్తరావల్లిలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో సాయంత్రం 6తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. ఆయా కేంద్రాల్లో జనరేటర్లను ముందస్తుగా ఏర్పాటు చేయకపోవడం వల్ల అటు సిబ్బంది, ఇటు ఓటర్లు తీవ్ర అవస్థలు పడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులు కొండలు, గుట్టలు, కాలువలు, నదులు దాటుకుని (మిగతా..3లో)

కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ శాతం
బొబ్బిలి	79.05
రాజాం	74.89
చీపురుపల్లి	80.88
నెల్లిమర్ల	79.28
గజపతినగరం	82.98
శృంగవరపుకోట	81.21
విజయనగరం	70.92
సాలూరు	58.02
పార్వతీపురం	68.21
కురుపాం	61
పాలకొండ	67.82

మన్యం జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు నమోదైన పోలింగ్ శాతం

పోలింగ్ అధికారిపై వైసిపి ఏజెంట్ల దాడి

గజపతినగరం : మండలంలోని కొత్త శ్రీరంగరాజపురం పోలింగ్ కేంద్రం(100)లో పోలింగ్ ఆఫీసర్‌పై వైసిపి ఏజెంట్లు దాడి చేశారు. ఓ వృద్ధురాలు ఓటు వేసేందుకు సాయంత్రం వచ్చింది. ఆమెకు చూపు సరిగా లేకపోవడంతో తన సమీప బంధువు ఇజ్జిరోతు వెంకటరమణ అనే యువకుడు సహాయంగా వెళ్లాడు. అయితే ఆయన కూడా పిఒనే ఓటు వేయాలని కోరాడు. దీంతో ఆ వృద్ధురాలు వైసిపికి ఓటు వేయాలని చెబితే పిఒ రాంబాబు టిడిపికి ఓటు వేశారని ఆరోపిస్తూ వైసిపి ఏజెంట్లు ఆయనపై మూకుమ్మడిగా దాడి చేశారు. పోలింగ్ సిబ్బంది అడ్డుకున్నప్పటికీ ఏజెంట్లతో పాటు గ్రామ నాయకులు, కార్యకర్తలు కూడా దారుణంగా (మిగతా..3లో)

పిఒపై దాడి చేస్తున్న వైసిపి ఏజెంట్లు

భోజరాజపురంలో ఎన్నికల బహిష్కరణ

ఎన్నికలను బహిష్కరించి ఇళ్ల వద్ద ఉన్న గ్రామస్తులు

దత్తిరాజేరు : మండలంలోని గుచ్చిమి పంచాయతీలోని భోజరాజపురం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. గుచ్చిమి పంచాయతీలో 620 మంది ఓటర్లు, భోజరాజపురంలో 250 మంది మొత్తంగా 870 మంది ఓటర్లు ఉన్నారు. గుచ్చిమిలో (మిగతా..3లో)

ఓటు వేయాలంటే నది దాటాల్సిందే

కొమరాడ : మండలంలోని నాగావళి నది ఆవల ఉన్న పలు పంచాయతీల ప్రజలు ఓట్లు వేయడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని తొమ్మిది పంచాయతీలు నది ఆవల ఉన్నప్పటికీ ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని చోళ్లపదం పంచాయతీకి చెందిన రెబ్బ, వనధర గ్రామాలు నాగావళి నది ఆవల ఉన్నాయి. ఆ రెండు గ్రామాలకు సంబంధించి సాధారణ ఎన్నికల్లో భాగంగా నది ఇవతల వైపు ఉన్న కూనేరులో పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. దీంతో ఓటు వేసేందుకు నది దాటాల్సిన పరిస్థితి గిరిజనులకు తప్ప లేదు. పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి కాకపోవడంతో నదిలో నడుచుకుంటూ ప్రమాదకర పరిస్థితిలో తమ ఓటు హక్కును గిరిజనులు వినియోగించుకున్నారు. ఓటు వేసిన ప్రతిసారీ ఈసారైనా తమ వంతెన పూర్తవుతుందని, రాకపోకలకు ఇబ్బందులు (మిగతా..3లో)

ఓటు వేసేందుకు వచ్చి ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల, గుమ్మలక్ష్మీపురం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఇద్దరు వృద్ధులు ఎండ ధాటికి తాళలేక సొమ్మసిల్లి అక్కడికక్కడే మృతి చెందారు. నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి గ్రామంలో పాలూరి పెంటమ్మ (65) ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చుంది. సుమారు గంటసేపు నిల్చోవడంతో ఒక్కసారిగా కుప్పకూలి కన్నుమూసింది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వెంటనే సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన హిడ్రా మృతి చెందాడు. మండల కేంద్రంలోని పెద్దఖర్జ గ్రామానికి చెందిన బిడ్డిక రాజారావు (55) అనే హిడ్రా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిల్చొన్నాడు. వడదెబ్బకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయి కన్నుమూశాడు.

ఓటేసేందుకు నది దాటుకుని వస్తున్న రెబ్బ గ్రామస్తులు

విజయనగరంలో 70.92 శాతం పోలింగ్

ఇవిఎంల మొరాయింపుతో పలుచోట్ల ఆలస్యం

ప్రజాశక్తి - గజపతినగరం

వృద్ధురాలిని ఓటేసేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

ఎన్నికల్లో భాగంగా ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 72, 77, 79 పోలింగ్ బూత్‌లతో పాటు మరికొన్ని పోలింగ్ బూత్‌ల్లో ఇవిఎంలు మొరాయించాయి. దీంతో సుమారు గంటకుపైగా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వచ్చిన ఓటర్లు భానుడి భగభగలకు తట్టుకోలేక గొంతు తడుపు కుందామన్న కనీసం మంచినీటి సదుపాయం లేక అవస్థలు పడ్డారు. పోలింగ్ సిబ్బందికి కూడా కనీస సౌకర్యాలైన మంచినీరు, మజ్జిగ, టీ, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.

గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, ఆయన సతీమణి దేవి అనురాధ, తనయుడు సాయి గురునాయుడు, కుమార్తె యామిని సింధులతో కుటుంబ సమేతంగా మండలంలోని పురిటిపెంట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని 84వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ గంట్యాడలో తమ ఓటుని వినియోగించు కున్నారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్ / కోట

విజయనగరం నియోజకవర్గంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత మాక్ పోలింగ్ నిర్వహించారు. ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైన తర్వాత నగరంలో లంకాపట్నం, గురజాడ స్కూల్, ఎంఆర్ కాలేజీ, మంగళ వీధి, కెఎల్ పురం తదితర ప్రాంతాల్లో ఇవిఎంలు గంటపాటు మొరాయించాయి. ఎంఆర్ కాలేజీలో మంత్రి బొత్స సత్యనారాయణ వేయాల్సిన పోలింగ్ కేంద్రం-166లో ఇవిఎం మొరాయించింది. దీంతో ఉదయం 8.30 గంటలకు ఓటు వేసేందుకు రావాల్సిన మంత్రి బొత్స 9.30 గంటలకు వచ్చారు. ఇవిఎం మరొకటి ఏర్పాటు చేయడంతో ఆ కేంద్రంలో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. నియోజకవర్గంలో

వైఎస్ఆర్ నగర్‌లో క్యూలో నిలబడిన ఓటర్లు

పలు చోట్ల మొరాయించిన ఇవిఎంలు
ఏడు కేంద్రాల్లో గంట ఆలస్యంగా ప్రారంభం

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియకు ఓటర్లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలో 8.25 శాతం, 11 గంటలకు 22.38 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 38.65 శాతం, మధ్యాహ్నం మూడు గంటలకు 44.40 శాతం, 4 గంటలకు 54.24 శాతం పోలింగ్ నమోదైంది. 2014లో విజయనగరం నియోజకవర్గంలో 70.92 శాతం, 2019లో 70.86 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సమయం ముగిసినప్పటికీ విజయనగరం నియోజకవర్గంలోని గుంకలాం, ద్వారపూడి, చెల్లూరు, వైఎస్ఆర్ నగర్, గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి, నెల్లిమర్లలోని డెంకాడ, నాతవలస, భోగాపురం మండల కేంద్రంలోని పలు పోలింగ్ బూతుల్లో పోలింగ్ కొనసాగింది. విజయనగరంలోని కనపాక, లంకాపట్నం విద్యుత్ నిలిచిపోవడంతో చీకటిలోనే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వైసిపి ఏజెంట్ వద్ద ఫోన్ లాక్కున్న టిడిపి అభ్యర్థి

విజయనగరం మండలం గొల్లలపేటలో వైసిపి ఏజెంట్లు ఫోన్లు పట్టుకొని పోలింగ్ బూత్‌లో ఉండడంతో టిడిపి

ఓటు వేసినట్లు చూపిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు వారి నుంచి ఫోన్ లాక్కొని కలెక్టర్‌కు సమాచారం అందించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేయాలని భావించారు. అయితే కలెక్టర్ బిజీగా ఉండడంతో ఫిర్యాదును రాతపూర్వకంగా ఇవ్వాలని సిబ్బంది సూచించారు. తాను ఉదయం నుంచి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా అధికారులు పట్టించుకోలేదని అదితి గజపతి తెలిపారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి జొన్నగుడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓటు వేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకరి సతీష్ విజయనగరంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరారు. పట్టణంలోని బంగారమ్మపేటలో పోలింగ్ కేంద్రం మందకొడిగా సాగింది. దీంతో క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇవిఎంలు సరిగ్గా పని చేయకపోవడంతో పోలింగ్ నెమ్మదిగా జరిగింది. నాయుడువీధి పోలింగ్ కేంద్రంలో భారీ క్యూలైన్‌లో నిలబడి వున్నారు. గుమడాంలో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగడంతో గొడవ సద్దుమణిగింది. ప్రధానంగా ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు పోలింగ్ కేంద్రాలకు ఉదయాన్నే తరలి వచ్చారు. కురుకుట్టిలో పోలింగ్ మందకొడిగా సాగడంతో మధ్యాహ్నం వరకు గిరిజనులు క్యూలైన్ లో వున్నారు.

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఆయన సతీమణి రోజమ్మ ఓటు వేశారు. అలాగే టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కూడా ఇక్కడే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. చింతలవీధి పోలింగ్ కేంద్రంలో జిసిసి చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, ఆమె భర్త గుల్లిపిల్లి గణేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని పెదపథం పోలింగ్ కేంద్రంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, ఆయన భార్య స్వర్ణలత, కుమార్తె గాయిత్రి, కుమారుడు శివలలిత ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మక్కువలో...

మండలంలో డి.శిర్లాం, చెముడులో స్వల్ప ఘర్షణలు మినహా అన్నిచోట్లా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మక్కువ తొలుత ఇవిఎంలు కొంతసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది దీంతో సాయంత్రం ఏడు గంటల దాటుతున్నా ఇంకా ఆయా స్టేషన్లో ఓటర్లు బారులు తీరి ఉన్నారు. సాయంత్రం వర్షం పడడంతో మక్కువ పోలింగ్ స్టేషన్లో ఉన్న ఓటర్లు అవస్థలు పడుతున్నారు బ్యాలెట్ బాక్సులు బస్సులో చేర్చేందుకు కూడా సిబ్బంది అవస్థలు పడాల్సి వచ్చింది.

మక్కువలో బారులు తీరిన మహిళా ఓటర్లు

పాచిపెంటలో...

మండలంలోని పాంచాలి, పాచిపెంటలో పోలింగ్ బూతుల వద్ద ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు అయితే మునిపెన్నడూ లేని విధంగా ఓటుకు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పాచిపెంటలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఐదు గంటల సమయం దాటినప్పటికీ ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఉదయం ఇవిఎంలపై కొంత మందికి అవగాహన లేకపోవడంతో ఎక్కువ సమయం ఓటర్ల క్యూలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బొబ్బిలిలో ప్రశాంతం

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బొబ్బిలి మండలంలోని అలజంగి, చింతాడ, పక్కి, రామభద్రపురం మండలంలోని కొండకెంగువ, భూసాయవలస గ్రామాల్లో టిడిపి వైసిపి మద్దతుదారులు మధ్య స్వల్ప గొడవలు జరిగాయి. పోలీసులు జోక్యంతో గొడవలు సద్దుమణిగాయి. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

అలజంగిలో వైసిపికి అనుకూలంగా బిఎల్ఓ

అలజంగిలో వైసిపికి అనుకూలంగా బిఎల్ఓ సతీష్ పని చేశారని టిడిపి మద్దతుదారులు ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓ వైసిపికి ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేశారని ఆరోపించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ పరిశీలించి బిఎల్ఓ సతీష్‌ను బయటకు పంపివేశారు. బిఎల్ఓపై చర్యలు తీసుకుంటామని ఆర్ఓ సాయిశ్రీ చెప్పారు. గొడవలకు పాల్పడిన ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. పక్కిలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య వాగ్వివాదం జరగ్గా పోలీసులు జోక్యంతో సద్దుమణిగింది. యువ ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. తమ మొదటి ఓటును తాము అభిమానించే నాయకునికి వేసేందుకు యువత పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. ఏ పోలింగ్ కేంద్రంలో చూసిన యువ ఓటర్ల హడావుడి కనిపించింది.

మొరాయించిన ఇవిఎంలు

బొబ్బిలిలో ఇవిఎంలు మొరాయించాయి. ఇవిఎంలు మొరాయించిన పోలింగ్ కేంద్రాలలో నత్తనడకన పోలింగ్ జరిగింది. మున్సిపాలిటీలోని తారక రామ కాలనీ, మల్లమ్మపేట పోలింగ్ కేంద్రాలలో ఇవిఎంలు మొరాయించడంతో సాంకేతిక సిబ్బంది బాగు చేశారు. దిబ్బగుడివలసలో ఇవిఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పక్కి, తారక రామ కాలనీలో పోలింగ్ నత్తనడకన జరిగింది.

అలజంగి, చింతాడలో తోపులాట

మండలంలోని అలజంగి, చింతాడ పోలింగ్ కేంద్రాల వద్ద టిడిపి, వైసిపి కార్యకర్తలు మధ్య తోపులాట జరిగింది. అలజంగిలో బిఎల్ఓ సతీష్ అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపిస్తూ టిడిపి మద్దతుదారులు ఆందోళనకు దిగారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బిఎల్ఓ సతీష్‌ను బయటకు పంపించారు. బిఎల్ఓ సతీష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఓ సాయిశ్రీ చెప్పారు. పోలింగ్ కేంద్రం బయట ఇరువర్గాలు గొడవలకు దిగడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పి చెదరగొట్టారు. చింతాడలో కూడా టిడిపి, వైసిపి కార్యకర్తలు గొడవలకు దిగడంతో పోలీసులు కలుగజేసుకుని చెదరగొట్టారు.

వృద్ధులు, వికలాంగులకు తప్పని అవస్థలు

పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్స్ ఏర్పాటు చేయకపోవడంతో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిఆర్ కాలనీలో ఒక వృద్ధురాలు ఓటు వేసేందుకు వచ్చి ఇబ్బందులు పడడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కనకరాజు ఆమెను ఎత్తుకుని తీసుకు వెళ్లి ఓటు వేయించి మరల తీసుకు వచ్చారు.

బాడంగి: వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారు. వర్క్ ఫర్ హోమ్ ఓటు పై కూడ అధికారులు అవగహన కల్పించక పోవడంతో ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ ప్రశాంతం

రామభద్రపురం: మండల వ్యాప్తంగా చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 నుంచే క్యూ లైన్లు నిండుకున్నాయి. బూసాయ వలస, కొండకెంగువల్లో టిడిపి, వైసిపి కార్యకర్తల నడుమ స్వల్ప తగాదాలు చోటు చేసుకున్నప్పటికీ పోలీసుల చొరవతో సద్దు మనిగాయి.

బొబ్బిలి: మొరాయిస్తున్న ఇవిఎంను చూపిస్తున్న అధికారులు

కొండకెంగువలో ఇవిఎం మెరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచి పోయింది.

మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన తన సోదరుడు రామ్ నాయనతో కలిసి తాండ్రపాపరాయ మున్సిపల్ పాఠశాలలో ఓటుహక్కును వినియోంచు కున్నారు. అనంతరం బేబినాయన, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. తెర్లాం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుం నాయుడు మండలంలోని ముగడ గ్రామంలో తన ఓటును వినియోగించు కున్నారు. బొబ్బిలి మండలం లోని పక్కి గ్రామంలోని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బొబ్బిలి: పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని ఎత్తుకుని తీసుకెళ్తున్న కానిస్టేబుల్

బాడంగిలో అధికారులతో

పక్కిలో టిడిపి ఏజెంట్‌పై దాడి

బొబ్బిలి : ఎమ్మెల్యే సొంత గ్రామం పక్కిలో టిడిపి ఏజెంట్ బాబూరావుపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే టిడిపి ఏజెంట్లుపై దాడి చేసేందుకు ముందస్తు ప్రణాళికలు చేసినట్లు టిడిపి కార్యకర్తలకు తెలియడంతో పోలీసులను భద్రత అడిగారు. పోలింగ్ ముగిసిన వెంటనే టిడిపి ఏజెంట్లను పోలీసులు వాహనంలో ఎక్కించుకుని బయటకు తీసుకుని వెళ్తుండగా పోలీసులు వాహనాన్ని అడ్డగించి ఏజెంట్లపై దాడి చేశారని టిడిపి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సమక్షంలో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

మన్యంలో ప్రశాంతం

కృష్ణపల్లిలో బారులు తీరిన ఓటర్లు

- 8గంటల వరకూ కొనసాగిన పోలింగ్
- పలుచోట్ల వర్షంతో అంతరాయం
- నిలిచిన విద్యుత్ సరఫరా... చీకట్లో పోలింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మన్యం జిల్లాలో అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉన్నా సాలూరు, మక్కువ, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, వీరఘట్టం, తదితర మండలాల్లో రాత్రి 10గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. అలాగే పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, మక్కువ తదితర మండలాల్లో వర్షం కురవడంతో ఓటర్లు అవస్థలుపడ్డారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్ లైట్ల సాయంతో పోలింగ్ నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గంలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలోనూ, సీతానగరం మండలంలోనూ రాత్రి 8గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్‌జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పర్యవేక్షణ కొనసాగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ వేడిమి తట్టుకునేందుకు టెంట్లను ఏర్పాటు చేయడంతో ఓటర్లు క్యూ లైన్ లో ఉన్నప్పటికీ ఎండ వేడిమికి గురి కాకుండా ఉండటం జరిగింది. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసారు. దీంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కొనుటకు బారులు తీరారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7గంటల నుండి ఓటర్లు క్యూలైన్‌లో నిలుచున్నారు. అందులో మహిళలు, యువత అధికంగా హక్కును వినియోగించుకొనేందుకు ముందుకు వచ్చారు. వృద్ధులు సైతం పోలింగ్ బూతులకు వచ్చి ఓటు వేశారు. వికలాంగులను త్రిచక్ర వాహనంపై వచ్చి ఓటు వేసి వెళ్లడం జరిగింది. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద సహాయకులు తమ సహాయ సహకారాలు అందించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు సైతం వారికి సహకరించి వారు సజావుగా ఓటింగ్ వేయుటకు తోడ్పాటు అందజేశారు. మొత్తంగా జిల్లాలో ఓటింగ్ ప్రశాంతంగా సజావుగా జరిగింది.

ఓటింగ్ ఉదయం 9 గంటల నాటికి 6.30 శాతం, 11 గంటల నాటికి 15.54 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట నాటికి 34.98 శాతం, మధ్యాహ్నం 3 నాటికి 51.75 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు సాయంత్రం ఐదు గంటల నాటికి 63.51 శాతం పోలింగ్ నమోదు అయింది.

ఉద్యాన కళాశాలలో స్ట్రాంగ్ రూం లు

ఉద్యాన కళాశాలలో జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు. సోమవారం పోలింగ్ అనంతరం ఇవిఎంలు నేరుగా ఉద్యాన కళాశాలకు చేరుకుంటాయి. వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అవసరమైన సిసి కెమెరాలు ఏర్పాటు, తగిన బందోబస్తును ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగింది.

ఓ(పో)టెత్తారు

(మొదటిపేజీ తరవుఆయి)

మధ్యాహ్నానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సాలూరు మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొఠియా గ్రామాల ప్రజానీకం ఇరు రాష్ట్రాలకు చెందిన ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులకు, అంటే చొరో నాలుగు ఓట్లు చొప్పున వేశారు. చంటిపిల్లలను చంకనెత్తుకొని క్యూలైన్లలో నిల్చున్నారు. ఇందుకనుగుణంగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఎన్నికల కమిషన్లు సమన్వయం చేసుకుని పోలింగ్ ఏర్పాటు చేశాయి. అక్కడ కూడా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. కొన్నిచోట్ల వీల్‌చైర్లు అందుబాటులో లేకపోవడం లేదా మరమ్మతులకు గురికావడంతో వృద్ధులు, వికలాంగులను తమ కుటుంబ సభ్యులు ఎత్తుకుని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం కనిపించింది. తమ గ్రామ అభివృద్ధి పట్టించుకోలేదన్న కోపంతో దత్తిరాజేరు మండలం గుచ్ఛిమి పంచాయతీ పరిధిలోని భోజరాజుపురం వాసులు ఓటింగ్‌ను బహిష్కరించారు. ఎండవేడికి తట్టుకోలేక గుమ్మలక్ష్మీపురం మండలం పెద ఖర్జ గ్రామానికి చెందిన హిజ్రా బిడ్డిక రాజారావు (55, నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి గ్రామంలో వృద్ధురాలు పాలూరి పెంటమ్మ (65) మృత్యువాత పడ్డారు. రాజాంలో పోలింగ్ నిర్వహణకు వచ్చిన ఓ ఉద్యోగి సొమ్మసిల్లి పడిపోయాడు. వైద్యసేవలందించేందుకు ఆయనను హుటాహుటిన విజయనగరం తరలించారు. గజపతినగరం మండలం పాత శ్రీరంగరాజ పురంలో తలెత్తిన వివాదంలో వైసిపికి చెందిన పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ ఆఫీసర్‌పై దాడికి పాల్పడ్డారు. ఉదయం 10:30గంటల సమయంలో గుర్ల మండలం బంటుపల్లిలో వైసిపి, టిడిపిలకు చెందిన నాయకుల మధ్య జరిగిన తోపులాట ఉద్రిక్త పరిస్థితికి దారితీయడంతో సుమారు గంటపాటు పోలింగ్ నిలిపివేశారు. దత్తిరాజేరు మండలం విద్యావాసి కృష్ణాపురంలో ఇరు పార్టీలకు చెందిన నాయకుల మధ్య పెనుగులాటలో పలువురికి గాయాలయ్యాయి. బొబ్బిలి మండలం చింతాడ, అలజంగి సహా జిల్లాలోని చాలా గ్రామాల్లో టిడిపి, వైసిపి నాయకులు మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. బొబ్బిలి మండలం పక్కిలో టిడిపి ఏజెంట్‌పై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు స్థానిక బిఎల్‌ఒలకు చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో, నాణ్యమైన భోజనాలు అందలేదని పోలింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. రెండు జిల్లాల ఎన్నికల అధికారులు ఎస్.నాగలక్ష్మి, నిశాంత్‌కుమార్ కంట్రోల్ రూమ్‌ల నుంచి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని డిఐజి విశాల్ గున్నీ తనిఖీ చేశారు. ఎన్నికల పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్ రాజాంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇరు జిల్లాల ఎస్‌పిలు ఎన్నికల పరిశీలకులు పలు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని పోలింగ్ సరళిని సమీక్షించారు. ండు జిల్లాల్లోనూ దాదాపు వైసిపి, టిడిపి, సిపిఎం, కాంగ్రెస్ తదితర పార్టీల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, రాజకీయ ప్రముఖులు, కలెక్టర్, ఎస్‌పి, జెసి వంటి ఉన్నతాధికారులు ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఇవిఎంలను పటిష్ట పోలీసుల భద్రత నడుమ విజయనగరంలోని జెఎన్‌టియు, లెండీ కాలజీలకు తరలించారు.

ఇదీ ఓటింగ్ సరళి

విజయనగరం జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల ఇవిఎంలు మొరాయించాయి. దీంతో, 9గంటల వరకు కేవలం 10.28 శాతం ఓటింగ్ మాత్రమే జరిగింది. ఆ తరువాత ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఓటర్లు సాహశించలేకపోయారు. దీంతో, 11గంటల సమయానికి కూడా 22.79శాతం ఓటింగ్‌కు పరిమితమైంది. మధ్యాహ్నం 1గంటకు జిల్లాలో ఓటింగ్ 39.56 శాతానికి చేరింది. 3గంటలకు 51.71 శాతం, సాయంత్రం 4గంటలకు 60.13 శాతం, 6గంటలకు 73.02 శాతం ఓటింగ్ నమోదైంది.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉదయం 9గంటలకి 6.53శాతం, 11గంటలకు 15.54శాతం, మధ్యాహ్నం 1గంటకి 34.98శాతం, 3గంటలకి 51.75శాతం, సాయంత్రం 5గంటలకి 63.51శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సిబ్బంది పారితోషికంలో కోత

ప్రజాశక్తి - విజయనగరం

పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బందికి ఇచ్చే పారితోషకంలో అధికారులు భారీ కోతపెట్టడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలింగ్ ఆఫీసర్లకు రూ.2,100, ఒపిఒలకు రూ.750 ఇవ్వాల్సి ఉండగా, ఒక్కొక్క నియోజకవర్గంలో ఒక్కోలా అధికారులు కోత పెట్టి ఇవ్వడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పిఒలకు రూ.1700, ఒపిఒలకు రూ.400 నుంచి రూ.500 వరకు ఇచ్చారు. భోజనాలు సక్రమంగా లేకపోవడంతో కొంతమంది అర్థాంకలితో ఉన్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

మొదటిపేజీ తరువాయి

ఓటు వేయాలంటే నది దాటాల్సిందే

ఉండవు అనే ఉద్దేశంతో అష్ట కష్టాలు పడి యువతీ యువకులు, వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు నది దాటుకొని వస్తున్నారు. ఈసారైనా కురుపాం ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

పోలింగ్ ఆఫీసర్‌పై వైసిపి ఏజెంట్ల దాడి

కొట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొత్స.అప్పలనరసయ్య పోలింగ్ బూత్ వద్దకు చేరుకుని పోలింగ్ నిలిపివేయాలని కాసేపు గొడవకు దిగారు. రెండు గంటల పాటు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. అనంతరం రిటర్నింగ్ అధికారి ఎంవి సూర్యకళకు మండల పార్టీ అధ్యక్షులు బూడి.వెంకటరావు, గ్రామ సర్పంచ్ పైడిపు నాయుడు ఫిర్యాదు చేయగా, ఆయనను అదుపులోకి తీసుకొని విచారణ చేపడతామని చెప్పి పోలింగ్ కొనసాగించారు. మరోవైపు పోలీసులు అక్కడికి చేరుకొని పిఒపై దాడి చేసిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

భోజరాజపురంలో ఎన్నికల బహిష్కరణ

ఓటర్లంతా ఓట్లు వేసేందుకు ముందుకు రాలేదు.గత కొన్ని దశాబ్దాలుగా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అయినా అధికారులు గాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోలేదని ఆవేదన చెందారు. రహదారిలేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు కూడా రాని పరిస్థితి ఉందని తెలిపారు. ఈనేపథ్యంలో పదిరోజుల క్రితం తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు విన్నవించారు. వారి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో తాము ఎన్నికలను బహిష్కరించినట్లు గ్రామ పెద్దలు. సారిపల్లి చంద్రయ్య, బోను రాము, బోను పైడితల్లి, కె.సచ్చారావు, మీసాల అప్పలనాయుడు, తెల్ల సీతయ్య తదితరులు తెలిపారు. తమ సమస్యలు ఇలాగే ఉంటే భవిష్యత్తులో పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. గ్రామంలో సిసి రోడ్లు గాని, మరుగుదొడ్లు, కాలువలు, తాగునీరు లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్, ఎంపిడిఒ వచ్చి పోలింగ్‌లో పాల్గొనాలని చెప్పారు. అయినా వారు ఓట్లు వేసేందుకు ముందుకు రాలేదు. తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటుచేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అప్పటివరకూ తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

ఓటర్లకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - పాలకొండ

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు ఇబ్బందులు తప్పలేదు. పాలకొండలోని ఆర్సీఎం, పెద్దకాపు వీధి పాఠశాలలతో పాటు ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో ఇవిఎంలు మొరాయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కస్పావీధి, ఆర్‌సిఎం పాఠశాలలతో పాటు వెలగవాడ పాఠశాలలో చీకటిగా ఉండడంతో ఓటర్లు కొంత ఇబ్బందికి గురైయ్యారు. సాయంత్రం 5గంటలకు ఓటింగ్ సమయం పూర్తి అయినప్పటికీ పెద్దకాపు వీధి, ఆర్సీఎం పాఠశాలలో పోలింగ్ కేంద్రాల వద్ద జనం కిక్కిరిసిలాడారు. ఆర్సీఎం పాఠశాల దగ్గర సాయంత్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిలోనే పోలింగ్ జరిగింది. వీరఘట్టం మండలం దశమంతపురం లోనూ ఇవిఎంలు మొరాయించడంతో కొంతసేపు పోలింగుకు అంతరాయం కలిగింది. తెట్టంగి పోలింగ్ కేంద్రం వద్ద కొమ్ములాట జరగడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అదుపు చేశారు. సీతంపేట మండలం సంభాం పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఓట్లు వేరే వ్యక్తి వేస్తున్నారని పోలింగ్ అధికారికి వైసీపీ వర్గాలు ఫిర్యాదు చేశారు. అలాగే సాయంత్రం 5గంటలకు పోలింగ్ పూర్తయినప్పటికీ ఓటర్లు క్యూలైనులో ఉండడంతో పోలింగ్ కొనసాగింది. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 13వ వార్డు, 10వ వార్డు కౌన్సిలర్లు ఏజెంట్లుగా కూర్చున్నారని కూటమి వర్గీయులు ఆరోపించారు.

చీకట్లోనే పోలింగ్

పాలకొండ, వీరఘట్టం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో చీకట్లోనే పోలింగ్ జరిగింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వర్షం కురవడంతో కొంత సమయం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో పాలకొండలోని ఆర్‌సిఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దకాపు వీధి స్కూల్‌లో, అంపిలి, గోపాలపురంతో పాటు వీరఘట్టం మండలంలో తెట్టంగి, తూడి, నీలానగరం తదితర పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు లేక ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యులు

సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కును ముఖ్యులు వినియోగించుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం, ఆయన సతీమణి పాలవలస ఇందుమతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరఘట్టం మండలం వండవలో వైసిపి అభ్యర్థి కళావతి, ఎం.రాజపురంలో జనసేన అభ్యర్థి జయకృష్ణ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నీలానగరంలో శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, పాలకొండ జడ్పీటీసీ పాలవలస గౌరీపార్వతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తప్పని తిప్పలు

భామిని : మండలంలోని 44 పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ జరిగింది. సాయంత్రం 4గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇవిఎం లో అభ్యర్థులు పేర్లు, గుర్తులు సరిగా కనిపించడం లేదని పలువురు ఓటర్లు తెలిపారు. సాయంత్రం భామిని పోలింగ్ కేంద్రంలో వర్షం రావడంతో ఓటర్లు ఓటు వేయటానికి వర్షంలో రావాల్సి వచ్చింది. పలువురు ఓటర్లు తమ ఓట్లు స్వంత పంచాయతీ పోలింగ్ బూత్‌ల్లో లేకపోవడం, ఇతర పంచాయతీల్లో ఉండటం తో ఓట్లు వేయడానికి వేరే పంచాయతీకి పరిగెత్తాల్సి వచ్చింది.

ఓటర్లకు మజ్జిగ పంపిణి చేసిన రోజు వారీ కూలి

మండలం కేంద్రమైన భామినిలోని రెండు పోలింగ్ బూత్‌ల్లో ఓటు వేసి వెనుతిరుగుతున్నవారికీ, అదే గ్రామానికి చెందిన రోజు వారి కూలి అయిన ఇమరక దండాసి మజ్జిగ పంపిణీ చేశాడు. రోజు వారి కూలి ఎండ తీవ్రత దృష్ట్యా మజ్జిగ పంపిణీపై పలువురు అభినందనలు తెలిపారు.

వీరఘట్టం మండలం నీలానగరంలో చీకట్లో జరుగుతున్న పోలింగ్

ఏజెన్సీలో ప్రశాంతంగా పోలింగ్

సీతంపేట : ఏజెన్సీలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మండలంలోని గోరపాడు, చింతాడ, హడ్డుబంగి తదితర ప్రాంతాల్లో ఇవిఎంలు కాసేపు మొరాయించడంతో పోలింగ్‌కు ఆటంకమైనప్పటికీ వెంటనే అధికారులు అప్రమత్తమై సరి చేశారు. ఓటర్లు ఎండ సైతం లెక్కచేయకుండా ఓటు వేయడానికి ఉత్సాహం చూపించారు. మరికొన్నిచోట్ల ఓటర్లు ఎండలోనే బారులు తీరారు. సాయంత్రం 3.30గంటల సమయంలో సీతంపేటలో చిన్నపాటి చినుకులు పడటంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఇవిఎంలపై గిరిజనులకు అవగాహన లేకపోవడంతో బటన్ నొక్క పోయి బొమ్మ మీద నొక్కడంతో ఓటర్లకు కొంత సమయం ఆలస్యం జరిగింది. అదేవిధంగా పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవిజామి తోట హడ్డుబంగి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వి.కళావతి పోలింగ్ సరళిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
మంగళవారం
14 మే 2024

వెల్లివిరిసిన చైతన్యం

బాలుడితో కలిసి ఓటు వేసేందుకు వచ్చిన మహిళ

విజయనగరంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

జియ్యమ్మవలస.. బందోబస్తు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్, చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక చికిత్స కేంద్రాలు

వికలాంగుడిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న సహాయకుడు

ఓటు హక్కు వినియోగించుకుంటున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

ఓటు వేసేందుకు క్యూలో ఉన్న పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ; బెల్లాన చంద్రశేఖర్ ; కలిశెట్టి అప్పలనాయుడు ; బొత్స ఝాన్సీలక్ష్మి ; కడుబండి శ్రీనివాసరావు ; విజయనగరం, మన్యం ఎస్‌పిలు దీపికా పాటిల్, విక్రాంత్ పాటిల్ ; పార్వతీపురం మన్యం జెసి శోభిక

ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు

లోకం మాధవి ; బడ్డుకొండ అప్పలనాయుడు ; కొండపల్లి శ్రీనివాస్ ; విశ్వసరాయి కళావతి ; నిమ్మక జయకృష్ణ ; గుమ్మిడి సంధ్యారాణి ; బేబినాయన ; అలజంగి జోగారావు ; బోనెల విజయచంద్ర ; పాముల పుష్పశ్రీవాణి ; తోయక జగదీశ్వరి

ఓటు హక్కు వినియోగించుకున్న గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనర్సయ్య కుటుంబసభ్యులు ; ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ; ఓటు హక్కు వినియోగించుకుంటున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు; టిడిపి ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు భరత్, లలితకుమారి

విజయనగరంలో మండుటెండలో బారులు తీరిన ఓటర్లు

గుమ్మలక్ష్మీపురం... ఇవిఎం మొరాయించడంతో వేచి ఉన్న ఓటర్లు

ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై రోగిని తీసుకొస్తున్న సహాయకుడు

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసేందుకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, చిత్రంలో టిడిపి అభ్యర్థి అదితి

సాలూరు.. ఓటు వేసేందుకు చిన్నారులతో తరలివచ్చిన గిరిజనులు

సాలూరు మండలంలో గిరిశిఖర గ్రామం గంజాయిభద్ర నుంచి ఓటు వేసేందుకు వస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడలో బారులు తీరిన ఓటర్లు

పాచిపెంట.. బారులు తీరిన ఓటర్లు

సాలూరు.. ఓటు వేసేందుకు బారులు తీరిన గిరిజనులు

నెల్లిమర్లలో 76.5 శాతం ఓటింగ్

ప్రజాశక్తి - పూసపాటిరేగ, నెల్లిమర్ల, భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గంలో 248 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం 6 గంటలకే పోలింగ్ అధికార్లు, రాజకీయ పార్టీల ఏజెంట్లు సమక్షంలో మాక్‌పోలింగ్ ప్రారంభమై ఉదయం 7 గంటలకు ముగించారు. అప్పటికే పోలింగ్ కేంద్రాలు వద్దకు ఓటర్లు భారీ ఎత్తున చేరుకున్నారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభించడంతో ప్రతి పోలింగ్ బూత్‌లో వందలాది మంది ఓటర్లు క్యూ కట్టారు. నియోజకవర్గంలో మొత్తం 2,13,551 ఓటర్లుకు గానూ ఉదయం 9 గంటలు లోపు 7.51 శాతం, 11 గంటలకు 19.37 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 37,43 శాతం, సాయంత్రం 3 గంటలకు 50.52 శాతం, 4 గంటలకు 57.04 ఓటింగ్ నమోదయ్యిందని అధికార్లు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు73.5 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఓటర్లు వందలాదిగా పోలింగ్ కేంద్రాలు వద్దకు చేరుకున్నా పోలింగ్ సిబ్బంది ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ జరపడంతో ఓటింగ్ శాతం మందకొండిగా నమోదైంది. ఓటర్లు ఎండవేడిమి తట్టు కోలేక వృద్ధులు సొమ్మసిల్లిపోయిన సంఘటనలు కోకొల్లలు. పోలింగ్ కేంద్రాలు వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్ట్ లేకపోవడంతో అక్కడక్కడ తోపులాటలు జరిగాయి. పూసపాటిరేగ పోలింగ్ స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ఓటర్ల మధ్య తోపులాట జరగడంతో కొంత మంది వృద్ధులు సొమ్మసిల్లారు. మహిళలు కొంత మంది ఓట్లు వేయకుండా వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న పోలింగ్ అధికార్లు, పోలీసులు అక్కడకు చేరుకొని లైన్లు ఏర్పాటు చేసి సమస్యను సద్దుమణిగేలా చేశారు. దీంతో ఓటర్లు మరలా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూసపాటిరేగ మండలంలోని తాళ్లపేట, భోగాపురం మండలంలోని ఎ.రావివలసలో ఇవిఎంలు మొరాయించాయి. వెంటనే అధికార్లు స్పందించి సరిచేశారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు తన స్వగ్రామం డెంకాడ మండలంలోని మోపాడలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పూసపాటిరేగ: సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు

భోగాపురం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

కూటమి అభ్యర్థి లోకం మాదవి భోగాపురం మండలంలోని గాబుబానిపేటలో తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సరగడ రమేష్ భోగాపురం మండలంలోని చెరుకుపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు పూసపాటిరేగ మండలంలోని రెల్లివలసలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నెల్లిమర్ల మండలంలోని తంగుడుబిల్లిలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలు మృతి చెందింది. చెదురు మదురు సంఘటనలు తప్పా అంతా ప్రశాంతంగా సాగింది. సోమవారం సాయంత్రం పోలిపల్లి పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌పి దీపికా పాటిల్ పరిశీలించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ బ్రాంచ్ స్కూల్ (ఉన్నత పాఠశాల)లో పోలింగ్ కేంద్రం 32 లో ఓటు హక్కును జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఆయన సతీమణి కరుణ వినియోగించుకున్నారు. దాదాపు గంట సేపు క్యూ లైన్ లో నిలుచుని ఓటును వేశారు. అనంతరం మీడియతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పండగలో ఓటు హక్కును సతీసమేతంగా వినియోగించు కోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తన ఆత్మ ప్రబోధం మేరకు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరుగుతోందని ఆయన చెప్పారు.

అలాగే ఎస్‌పి విక్రాంత్ పాటిల్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక స్థానిక ప్రభుత్వ బ్రాంచ్ స్కూల్ (ఉన్నత పాఠశాల)32లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర దంపతులు మండలంలోని వెంకంపేటలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మూడు చోట్ల ఉద్రిక్తత

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలోని రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకే ప్రారంభించిన పోలింగ్ పెద్ద సంఖ్యలో ఓటర్లు హాజరయ్యారు. రేగిడి మండలం సంకిలి, పెద్దపుర్లి, వావిలివలస గ్రామ పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి, టిడిపి నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బూరాడ, సంకిలి గ్రామాల్లో ఇవిఎంలు 45నిమిషాలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దపుర్లిలో వైసిపి నాయకులు రిగ్గింగ్‌కు ప్రయత్నించగా టిడిపి నాయకులు అడ్డుకుని గొడవకు దిగారు. దీంతో ఇరు గ్రూపులను పోలీసులు చెదర కొట్టారు. ఏ. వెంకటాపురం పోలింగ్ బూత్‌లో వైసిపి, టిడిపి నాయకులు గొడవపడటంతో పిఒ సర్ది చెప్పారు. రాజాం మండలం ఒమ్మి, చీకటిపేటలో ఇవిఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. సంతకవిటి మండలంలో ఒకటి, రెండు చోట్ల స్వల్ప ఘర్షణలు పడ్డారు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద సరైన బందోబస్తు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు లేకపోవడంతో సిబ్బందితో పాటు ఓటర్లు కూడా ఇబ్బందులు పడ్డారు.

రేగిడి: పోలింగ్ వద్ద గొడవ పడుతున్న టిడిపి, వైసిపి నాయకులు

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

వంగర: మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కే కొత్తవలస, కొప్పర, మద్దివలస గ్రామాలలో చిన్నపాటి ఘర్షణలు జరిగినప్పటికీ ఆయా గ్రామాలలో రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ వైవి జనార్దన్‌తో కలిసి అక్కడకు చేరుకొని ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా చేశారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే చేరుకుని ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఈవీఎంలపై సరైన అవగాహన లేకపోవడంతో పోలింగ్ నెమ్మదిగా సాగింది. దీంతో ఓటర్లు క్యూలైన్లలో ఎక్కువసేపు ఉండవలసిన పరిస్థితి నెలకొంది. విద్యుత్తు మధ్య మధ్యలో ఆగిపోతుండటంతో ఓటర్లు, ఎన్నికల సిబ్బంది కొంతమేర ఇబ్బంది పడ్డారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి- చీపురుపల్లి, గుర్ల

మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చీపురుపల్లి నియోజకవర్గంలో 80శాతం పోలింగ్ జరిగింది. గతంలో కంటే ఆశాజనకంగా ఓటింగ్ శాతం పెరిగింది. కొత్తఓటర్లు పోలింగ్‌లో పాల్గొనడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందని అంచనా వేశారు. గుర్ల మండలంలోని పెద్దబంటుపల్లి కోటగండ్రెడు గ్రామాల్లో ఇవిఎంలు మొరాయించడం వల్ల పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో క్యూలో నిలబడటానికి ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన బొత్స

చీపురుపల్లి: నియోజకవర్గంలో జరుగుతున్న ఓటింగ్ సరళిని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పరిశీలించారు. స్థానిక బాలుర, రెసిడెన్షియల్ పాఠశాలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులతో బొత్స మాట్లాడారు. మరోవైపు పోలింగ్ కేంద్రాలను టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు సందర్శించారు. పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లుతో ఆయన మాట్లాడారు. విజయనగరం కూటమి ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు బాడంగి హెడ్ కోర్టర్‌లో పోలింగ్ బూత్‌ని పరిశీలించారు.

ఓటు వేసేందుకు వస్తున్న 90 ఏళ్ల వృద్ధుడు

ఓటు హక్కు వినియోగించుకున్న 90 ఏళ్ల వృద్ధుడు

90 ఏళ్ల వయసున్న కిల్లంశెట్టి రామాంజనేయులు అనే విశ్రాంత ఉపాధ్యాయుడు తన ఓటు హక్కుని వినియోగించుకున్నాడు. చీపురుపల్లి పట్టణానికి చెందిన ఆయన తన కుమారుడు సహాయంతో బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబరు 139లో తానే స్వయంగా ఎంపి అభ్యర్థికి, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేశారు. విజయనగరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో గల 140వ పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున స్థానిక గురుకుల పాఠశాలలో ఉన్న 142వ పోలింగ్ బూత్‌లో తమ ఓటును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 136వ పోలింగ్ బూత్‌లో తన ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి బొత్స

రాత్రి 8 వరకూ పోలింగ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్.కోట నియోజకవర్గంలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ సాగింది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6గంటల సమయానికి 74.85శాతం ఓట్లు నమోదయ్యాయి. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన ఎన్నికల ప్రక్రియ కొన్నిచోట్ల ఇవిఎంలు మొరాయించడం వల్ల ఆలస్యంగా ప్రారంభమైంది. శృంగవరపుకోట మండలంలోని రేవల్ల పాలెం, పోతనపల్లి, పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించాయి. జామి మండలంలో జాగరం, చింతాడ, లొట్లపల్లి, వేపాడ మండలంలోని సోంపురం అదేవిధంగా కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లోని పలు గ్రామాల్లో ఇవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. దీంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎన్నికల అధికారులు ఓటర్లకు అరకొర సౌకర్యాలు కల్పించడం పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా టెంట్లు చాలక, తాగునీరు, వృద్ధులకు, వికలాంగులకు వీల్ చైర్స్ లేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత వల్ల కొంతమంది ఓటర్లు మధ్యాహ్నం ఓటు వేయ వచ్చిని వెనుతిరగడంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు పెరిగాయి. సాయంత్రం 6 గంటల సమయానికి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని బొడ్డవర, సీతమ్మ పేట, పట్టణంలోని చింత స్కూలు, శ్రీనివాసకాలనీ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల డిప్యూటీ తాహశీల్దార్ నారాయణమ్మను వివరణ కోరగా పోలింగ్ సమయం ముగిసేసరికి ఇంకా నాలుగు కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు వేసేందుకు ఉన్నారని, రాత్రి 9 గంటల లోపు పోలింగ్ పూర్తవుతుందని తెలిపారు.



కొత్తవలస: వికలాంగుడును తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

ఇచ్చారు. సాయంత్రం 6 గంటల సమయానికి శంగవరపుకోట నియోజకవర్గం 77.78 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారి తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కడుబండి శ్రీనివాసరావు, కోళ్ల లలిత కుమారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లక్కవరపుకోట మండలం ఖాసాపేటలోని పోలింగ్ బూత్ నంబర్ 126 కోళ్ల లలిత కుమారి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకోగా కొత్తవలసలోని పోలింగ్ బూత్ నంబర్ 212లో కడు బండి శ్రీనివాసరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అరకొర ఏర్పాట్లతో ఓటర్ల ఇబ్బందులు

కొత్తవలస :కొత్తవలస మండలంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. సంతపాలెం పోలింగ్ కేంద్రంలో అరగంట పాటు ఇవిఎం ఇబ్బంది పెట్టినప్పటికీ తరువాత సిబ్బంది సరి చేశారు. కొత్తవలస మండలం

సాయంత్రం 6గంటలకు భారీ వర్షం ఇబ్బందులు పడ్డ ఓటర్లు

ఎస్‌కోట: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు

కంటకాపల్లిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు అరకొరగా ఉన్నాయని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. వద్దులు, వికలాంగుల ఓటర్లను పోలింగ్ బూత్ లోకి తీసుకు వెళ్లడానికి సరి అయిన పరికరాలు, వీల్ చైర్స్ లేక ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 202 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024

ఏజెన్సీలో ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 268 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సుమారు 66.57శాతం పోలింగ్‌శాతం నమోదైంది. నియోజకవర్గంలోని 1,94,114 మందికి గానూ, 1,29,223మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివన్న పేట పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య కొద్దిపాటి తోపులాట జరిగింది. ఆ సమయంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖ రావు పోలీసు సిబ్బందితో ఇరువర్గాలను సద్దుమణిగి చేశారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి పోలింగ్ శాతం తగ్గింది.

ఓటు హక్కు వినియోగించుకున్న వైరిచర్ల

కురుపాం:కురుపాం శివన్న పేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు వజ్రాయుధంతో సమానం అని... అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఓటింగ్..

గుమ్మలక్ష్మీపురం : మండలంలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. 27 పంచాయతీల్లో 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవిఎంలు మొరాయించడంతో తాడికొండలో 45 నిమిషాలు, లాడలో రెండు గంటల పాటు ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. చాపరాయి బిన్నిడి, కె.శివడ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు వేసేందుకు రావడంతో గంటలు తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

కురుపాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

కురుపాం నియోజక వర్గంలో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇండియా కూటమి బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ సవరకోటపాడులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి తాడికొండలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గిరిజన ఓటర్లలో చైతన్యం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సాధారణ ఎన్నికల్లో గిరిజన ఓటరు చైతన్యం కనిపించింది. పోలింగ్ కేంద్రానికి ఏడు గంటల నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో క్యూలైన్‌లో ఉండటం విశేషం. తాడికొండ, కేదారిపురం, వంగర, ఇరిడి, కే శివడ, కొత్తగూడ, కొండవాడ పోలింగ్ కేంద్రాల వద్ద గిరిజనులు ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఇవిఎంలు మోరాయించిన వీరు సహనంతో క్యూలైన్లో నిలబడే కనిపించారు. గిరిజనుల్లో అక్షరాస్యత పెరగడం సామాజిక చైతన్యం పెరిగినందున పోలింగ్ శాతం పెరుగుతుందని పరీక్షలకు భావిస్తున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు

మండలంలోని పెద్దఎత్తున వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుమ్మలక్ష్మీపురం, రేగిడి, దుడ్డుఖల్లు గ్రామాల్లో ఓటర్లు నడవలేని స్థితిలో ఉన్న 70 ఏళ్ల పైబడిన వారు తోటి వారి సాయంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ అమూల్యమైన ఓటును వినియోగించుకున్నారు.

కొమరాడ : మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 60 పోలింగ్ బూతుల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు. 60 పోలింగ్ బూత్‌లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైనప్పటికీ కొన్ని పోలింగ్ బూత్‌లో ఇవిఎంలు మొదట్లో ఆన్‌చేయడం రాక కొంత ఆలస్యమైంది. మరికొన్ని చోట్ల ఏజెంట్లు రాకపోవడంతో పోలింగ్ ఆలస్యంగా జరిగినట్లు పలువురు తెలిపారు. కొమరాడ, మాదలింగి, విక్రాంపురం పోలింగ్ కేంద్రాల వద్ద ఇరు పార్టీ వారికి స్వల్ప ఘర్షణలు జరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘర్షణ పడుతున్న వారిని చెదరగొట్టి ఎటువంటి గొడవలు లేకుండా చేశారు. పోలింగ్ కేంద్ర పరిసర ప్రాంతాల్లో 200 మీటర్ల వరకు ఇతరులను అనుమతించకపోవడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని చోళపదం, కొమరాడ తదితర పోలీస్ కేంద్రాల వద్ద సౌకర్యాలు సక్రమంగా కల్పించకపోవడంతో ఓటరుతో పాటు ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చిన సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచినీరు, భోజనం సదుపాయం కూడా సక్రమంగా లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు ముందుకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఏర్పాట్లను కొమరాడ ఎస్సై నీలకంఠంతో పలువురు సిఐలు డీఎస్పీలు ఎప్పటికప్పుడు పోలింగ్ స్టేషన్లను సందర్శిస్తున్నారు. వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో బాధపడుతున్న వారు కూడా కుటుంబ సభ్యుల సహకారంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అష్టకష్టాలు పడి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

నత్తనడకన పోలింగ్

జియ్యమ్మవలస: మండలంలోని మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ నత్తనడకన సాగింది. మండలంలో 59పోలింగ్ కేంద్రాల్లో జరిగిన పోలింగ్‌లో 30శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఏజెంట్లు ఆలస్యంగా విధులకు హాజరవ్వడంతో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డలతో ఓటు వేసేందుకు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా పెదబుడ్డిడి ,శిఖబడి గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. 2019 ఎన్నికల్లో చినకుదమలో తీవ్ర ఉద్రిక్తతను దృష్టిలో ఉంచుకుని ముందుస్తుగా పోలీసలు బందోబస్తు భారీగా మోహరించారు. చినమేరంగిలో వైసిపి అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి తన ఓటును వినియోగించుకున్నారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు తన ఓటును వనిజలో వేశారు.

బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న పరిశీలకులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎన్నికల పరిశీలకులు ప్రమోద్ మాన్వార్ పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లను దగ్గర ఉండి పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈయన వెంట ఆర్వో శుభం బన్సల్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స వైద్య శిబిరాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన బూర్జ, కెఆర్ పురం, పెదంకలాం పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాల్లో ఉంచిన మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య పరికరాలు పరిశీలించారు. పోలింగ్ పూర్తయ్యేంత వరకు శిబిరాన్ని కొనసాగించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

మోడల్ పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక అలంకరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కురుపాం నియోజక వర్గ పరిధిలోని పెద్దూరు, గరుగుబిల్లి గ్రామ పంచాయతీల్లోని రెండు పోలింగ్ కేంద్రాలు మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపికయ్యాయి. ఈ మేరకు సోమవారం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పెద్దూరు లోని 234, గరుగుబిల్లిలోని 236 పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు పోలింగ్ కేంద్రానికి ఓటర్లు వెళ్లేందుకు రైలింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పచ్చని తివాచీలను వేశారు.

ప్రశాంతంగా పోలింగ్

సోమవారం జరిగిన పోలింగ్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఓట్లు హక్కును వియోగించుకొనేందుకు ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టి ఓటును వేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇవిఎంలు మోరాయించడం వల్ల కొంత సమయం ఆలస్యంగా ప్రారంభ మయ్యాయి. మహిళలు అధిక సంఖ్యలో ఓట్లు వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న యువత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సోమవారం జరిగిన 2024 సాధారణ ఎన్నికల్లో యువతీ యువకులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు కలగడం అభ్యర్థులకు ఓటు వేయటం వల్ల ఎంతో సంతోషం ఇచ్చింది యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వచ్చిన యువ ఓటర్లు

క్యూ కట్టిన ఓటర్లు

రాత్రి 9గంటల వరకు కొనసాగిన పోలింగ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/టౌన్

మండలం, పట్టణంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకొని బారులు తీరి క్యూలైన్లు కనిపించాయి. మండలంలోని నర్సిపురం, వెంకటరాయుడిపేట, బాలగోడబ, అడ్డాపుసిల గోపాలపురం, కృష్ణపల్లి, వెంకంపేట, పెదమరికి, ఎల్ఎన్ పురం, సంగంవలస పోలింగ్ బూతుల దగ్గర అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు. గిరిజనులు అధికంగా ఉండే రావికోన, బట్టివలస, రంగాలగూడ గ్రామాల్లో గిరిజనులు భారీ సంఖ్యలో తరలి రావడంతో మధ్యాహ్నానికి పోలింగ్ ఆయా పోలింగ్ కేంద్రాల్లో 50 శాతానికి దాటడం విశేషం. పెద్ద బొండపల్లి, చిన్న బొండపల్లి, ఎంఆర్ నగరంలో కేంద్రాలకు అధిక సంఖ్యలో ఓటర్లు హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటలకు నియోజకవర్గ ఓటింగ్ 55 శాతానికి చేరుకోగా, సాయంత్రం 6 వరకు ఓటింగ్కు అవకాశం ఉన్నందున పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పట్టణంలోని వివేకానంద కాలనీ, మున్సిపల్ పాఠశాలల్లో పోలింగ్ సమయంలో ముగిసినా రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ప్రశాంతంగా పోలింగ్

బలిజిపేట: మండలంలోని 24 పంచాయితీల్లో గల 67 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ తీవ్రతను బట్టి సుమారు 12 గంటల నుండి 3.30 గంటల వరకు పోలింగ్ మందకొడిగా నడిచిన ఆ తర్వాత పోలింగ్ పుంజుకుంది. అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు సమన్వయంతో ఎన్నికలను ముందుకు నడిపించారు. మండలంలోని ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి అయిన అలజంగి జోగారావు తన సొంత గ్రామమైన చిలకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎక్కడ అవాంఛనీయ సంఘటనలో జరగకుండా పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు సమన్వయంతో పని చేశారని అభినందించారు.

సీతానగరం : మండలంలోని ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 46,763 మంది ఓటర్లకు గానూ సుమారు 36వేల వరకు ఓట్లు నమోదయ్యాయి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మండలంలోని సీతానగరం, చినబోగిలి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట సిఐ కె.రవికుమార్, ఎస్సై ఎం.రాజేష్ ఉన్నారు. చిన్న భోగిలలో ఓట్లు వేసేందుకు రాత్రి 8 గంటల వరకు ఓటర్లు నిరీక్షించారు.

పార్వతీపురం మున్సిపల్ పాఠశాల వద్ద రాత్రి కూడా బారులు తీరిన ఓటర్లు

సీతానగరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

జనసంచారం లేక బోసిపోయిన కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్

నగరంలో ఎన్నికల కర్ఫ్యూ

బోసిపోయిన ప్రధాన రహదారులు, మార్కెట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఎన్నికల కర్ఫ్యూ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సోమవారం నగరంలోని రహదారులు, మార్కెట్లు బోసిపోయాయి. షాపులు సైతం మూతపడడంతో నగరంలో నిర్మానుష వాతావరణం నెలకొంది. ఎన్నికలు జరుగుతుండటంతో అన్ని షాపులకు సెలవు ప్రకటించడంతో మార్కెట్లలో షాపులన్నీ మూతపడ్డాయి. నిత్యం వేలాదిమంది తో రద్దీగా ఉండే గంటస్తంబం జంక్షన్,ఎంజి రోడ్డు, కలెక్టరేట్ ప్రాంతం, బాలాజీ జంక్షన్, కోట జంక్షన్ ప్రాంతాలు నిర్మునుష్యంగా మారాయి. జనం లేక రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి.

నిర్మానుష్యంగా రహదారులు

బొబ్బిలి : పట్టణ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎన్నికలు జరగడంతో పట్టణంలో నివసించే ఉద్యోగులు, కార్మికులు ఓటు వేసేందుకు సొంత గ్రామాలకు వెళ్లారు. పట్టణ ప్రజలు కూడా ఓటు వేసి ఎండ తీవ్రతకు బయటకు వచ్చేందుకు భయపడడంతో పట్టణ రోడ్లు కర్ఫ్యూను తలపించాయి.

పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న డిఐజి విశాల్ గున్ని

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిఐజి

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్నికలను విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని సోమవారం సందర్శించారు. ఎన్నికల జరుగుతున్న తీరు తెన్నెలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రమౌళితో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. పోలింగ్ జరిగిన తర్వాత కూడా ఎక్కడా ఎటువంటి అల్లరులు జరగకుండా చూడాలన్నారు. అలాంటి గ్రామాన్ని గుర్తించి బందోబస్తు చేయాలన్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ విశాఖ రేంజ్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. చెదరుమొదరు సంఘటనలు తప్ప ప్రశాంత వాతావరణంలోనే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు కేసులు, శ్రీకాకుళంలో ఒక్క కేసు ఎన్నికలకు సంబంధించి నమోదు చేశామని, వాటిని పరిశీలిస్తామని చెప్పారు.

సిబిఎస్‌సి టెన్త్, ఇంటర్ ఫలితాల్లో

కేంద్రీయ విద్యాలయం హవా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సోమవారం వెలువడిన సిబిఎస్ఇ టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో విజయనగరంలోని కేంద్రి విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతిలో ఎంపి గాయత్రి వసంత -487 మార్కులు (97. 4 శాతం)తో ప్రథమ స్థానం , సిహెచ్ ప్రవల్లిక 467 మార్కులు (93.4 శాతం)తో ద్వితీయ స్థానం , కెవికెఎన్ఎస్ ఆర్ శ్రీకర్ 465 మార్కులు (93 శాతంతో) తృతీయ స్థానంలో నిలిచారు. పన్నెండో తరగతిలో జి. వెంకట గాయత్రి అమృత 456 మార్కులతో (91.2శాతం) ప్రథమ స్థానం, జి.లక్ష్మి సాయి ప్రశాంతి 442 (88. 4శాతం) తో ద్వితీయ స్థానం, పి.సాయి మహిత లిఖిత 437 (87.4శాతం) మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు . ఇంతటి ఘన విజయానికి కారణమైన విద్యార్థులను, వారి తల్లితండ్రులను, ఉపాధ్యాయులను విద్యాలయ ప్రిన్సిపాల్ దీలిప్ మోడీ అభినందించారు. 11వ తరగతిలో ప్రవేశాల కోసం మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట/టౌన్

జిల్లాలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. అక్కడక్కడా ఇవిఎంల్లో స్వల్ప అవాంతరాలు తలెత్తగా, వెంటనే అధికారులు స్పందించి సరిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1847 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ, ఆ తరువాత పుంజుకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు బారులు తీరారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే చాలా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన టెంట్లు సరిపోక ఎండలోనే ఓటర్లు వేచి ఉండాల్సి వచ్చింది. వృద్దులు, విభిన్న ప్రతిభావంతుల కోసం వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచుతామని అధికారులు ప్రకటించినా చాలా చోట్ల వీల్ ఛైర్లు లేక వికలాంగులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని మొత్తం 11 మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూము నుంచి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఉదయం 4.30 గంటల నుంచే వెబ్ కాస్టింగ్ ద్వారా, ఆర్ఒల ద్వారా పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఇవిఎంల్లో సమస్యలు తలెత్తిన చోట, వెంటనే సంబంధిత అధికారులను హెచ్చరించి, వాటిని సరిచేసి, పోలింగ్ కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై మరింత దృష్టి సారించారు.

విస్తృతంగా పర్యటించిన ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా సోమవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పోలింగ్ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్ల ద్వారా పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్, జిల్లా వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రంజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ కూడా జిల్లాలో పర్యటించి, పోలింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్

కంటోన్మెంట్ హైస్కూల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరని ఓటర్లు

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జిల్లాలో పలువురు ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక కణపాకవద్దనున్న పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ కూడా ఇదే పోలింగ్ కేంద్రంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక తోటపాలెంలోని పోలింగ్ కేంద్రంలో ఓటువేశారు. విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి కుటుంబ సమేతంగా, ఎంఆర్ కళాశాలలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి కంటోన్మెంటు సెయింట్ మేరీస్ పాఠశాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి బాలికల గురుకుల పాఠశాలలో ఓటు వేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జొన్నగుడ్డి పాఠశాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పోటెత్తిన కొటియా ఓటర్లు

నేరెళ్లవలసలో ఉదయం నుంచి మందకొడిగా పోలింగ్

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల ఓటర్లు ఓటు వేయడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. నేరెళ్లవలస, శిఖపరువు పోలింగ్ కేంద్రాలకు కొటియా గ్రామాల ఓటర్లను వాహనాల్లో తీసుకొచ్చారు. పట్టుచెన్నూరు, పగుల చెన్నూరు గ్రామాల ఓటర్లను ఆదివారం సాయంత్రానికి అధికారపార్టీ నాయకులు శిఖపరువు సమీపంలో ఉన్న హాస్టల్‌కు తీసుకొచ్చి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. నేరెళ్లవలసలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల కు గంజాయిభద్ర పంచాయతీ నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలి వచ్చారు. వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు ఆధ్వర్యాన గిరిశిఖర గ్రామాల ఓటర్లను తరలించారు. సాయంత్రం వరకు భారీ క్యూలైన్‌లో ఓటర్లు నిలబడి వున్నారు. ఇవిఎంలు సరిగ్గా పని చేయకపోవడంతో పోలింగ్ నత్తనడకన సాగింది. దీంతో గిరిజన మహిళలు ఉదయం నుంచి క్యూలైన్‌లో నిలబడి వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేరెళ్లవలస కొటియా సిఐలు నారాయణరావు, రేవతీ పతి ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇదిలా ఉండగా ఒడిశా పోలింగ్ కేంద్రాలలోనే ఓటు వేయాలని ఒడిశా అధికారులు, పోలీసులు ఒత్తిడి చేయడంతో కొంత ఆందోళనకు గురయ్యారు. ఆంధ్రా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాలనే ఆశక్తి వున్నా కొంతవరకు భయపడ్డారు. అయితే రెండు రాష్ట్రాల్లోనూ ఓటు వేయొచ్చునని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేయడంతో గిరిజనులు రెండు రాష్ట్రాల కు ఒకేరోజు ఓటు వేశారు. ఒడిశాలోని పొట్టంగి అసెంబ్లీ కొరాపుట్ ఎంపీ స్థానాలకు, ఎపిలోని సాలూరు అసెంబ్లీ, అరుకు ఎంపీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కొటియా గ్రామాల ఓటర్లు నాలుగు ఓట్లు వేశారు. ఈ క్రమంలోనే నేరెళ్ళవలసకి గిరిజనులు ఒడిశా పోలింగ్ కేంద్రం రణసింగిలో ఓటు వేయడానికి వ్యానులో వెళ్లి వస్తుండగా నేరెళ్లవలస వద్ద వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో సోకిల కన్నమ్మకి స్వల్ప గాయాలయ్యాయి.

జగన్ సిఎం కావడం ఖాయం : బొత్స

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం ఎంఆర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు తన సతీమణి, విశాఖ పార్లమెంట్ వైసిపి అభ్యర్థి ఝాన్సీలక్ష్మితో కలిసి ఓటు వేసేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ఓటర్లు ముందుకు వచ్చి ఓట్లు వేస్తున్నారని అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం , అభివృద్ధి, ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడం లక్ష్యంగా పని చేశామని తెలిపారు. ఎన్నికల ముందు వాట్సాప్ గ్రూపుల్లో రకరకాల ఫేక్ మెసేజ్‌లు పెట్టి జిమ్మిక్కులు చేస్తున్నారని, తాను పార్టీ మారిపోతున్నట్లు ప్రచారం చేయడం నీచమైన చర్యని అన్నారు. ఫేక్ న్యూస్ లు పెట్టి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని, ప్రజలు ఇటువంటివి నమ్మే స్థితిలో లేరని అన్నారు. మరోసారి తాము అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక సోమవారం విజయనగరం నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలంచారు. అక్కడ బందోబస్తుపై ఆరా తీశారు. విటి అగ్రహారం, బిసి కాలనీ, లంకాపట్నం, దాసన్నపేట పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడాలని, ఓటర్లను క్యూ లైన్లలో పంపాలని, 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు మాత్రమే ఉండాలని ఆదేశించారు. ఎస్‌పి వెంట ఎస్‌బి సిఐ కెకెవి విజయనాథ్, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని గుడివాడ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఇవిఎంలను సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లకు పోలీసు ఎస్కార్టుతో తీసుకెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రాజాం నియోజకవర్గంలోని ఉణుకూరు, బొద్దాం పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ పరిశీలించారు. ఏ చిన్న సంఘటన తలెత్తినా సంబంధిత రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ లకు సమాచారం అందించాలని సూచించారు. ఆమె వెంట ట్రైనీ డిఎస్‌పి ఎస్.మహేంద్ర, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల మండలం గుడివాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి దీపికాపాటిల్